## కలెక్టర్‌తో కార్వాన్ ఎమ్మెల్యే భేటీ



కలెక్టర్ హరిచందనతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్

మెహిదీపట్నం జూన్ 18: కార్వాన్ నియోజకవర్గం టోలిచౌకి డివిజన్ ఎండీ లైన్స్‌లోని మిలిటరీ క్వార్టర్ల క్రమబద్ధీకరణను వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే మహమ్మద్ కౌసర్ మొయినుద్దీన్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి చందనకు బుధవారం వినతి పత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ మిలటరీ అధికారులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాగా ఈ అంశం చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉందని, వెంటనే పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే కలెక్టర్‌కు సూచించారు.

## 'ఆషాఢం' బోనాలకు ఏర్పాట్లు చేయాలి



మెహిదీపట్నం, జూన్ 18: తెలంగాణ ఆషాఢమాసం బోనాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని నగర పోలీస్ అదనపు కమిషనర్ విక్రమ్‌మాన్‌సింగ్, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్ అన్నారు. బుధవారం సాయంత్రం గోల్కొండలో ప్రభుత్వాధికారులు పర్యటించారు. జూన్ 26న ప్రారంభం కానున్న గోల్కొండ బోనాల కోసం తీసుకోవాల్సిన ఏర్పాట్ల గురించి ఈ సందర్భంగా చర్చించారు. కార్యక్రమంలో గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ చంటిబాబు, దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్, ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు, ఈవో వసంత, ఏసీపీ సయ్యద్ ఫయాజ్, కమిటీ సభ్యులు సంతోష్, ప్రదీప్‌కుమార్, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర, విజయగాథలను అధ్యయనం చేయాలి



'ద ఎంపైర్ ఆఫ్ గాడ్ కింగ్' గ్రంథ ఆవిష్కరణలో పాల్గొన్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, జూన్ 18. మన పూర్వీకుల చరిత్రను, విజయగాథలను అధ్యయనం చేసి సారాన్ని గ్రహించి భావితరాలకు అందించాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శ్రీకృష్ణ దేవరాయ, విజయనగర సామ్రాజ్య మహోన్నత చరిత్రను నేటి తరానికి తెలిపేలా వారి వారసుడు, తిరుమల వెంకట దేవరాయ రచించిన 'ద ఎంపైర్ ఆఫ్ గాడ్ కింగ్' అనే ఆంగ్ల గ్రంథాన్ని బుధవారం సాయంత్రం ఆదర్శనగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్ ప్రాంగణం భాస్కర ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే శ్రీకృష్ణ దేవరాయ పరిపాలన చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు. మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్‌వీ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. విజయనగర రాజుల పరిపాలన చరిత్రకు సాక్ష్యంగా ఈ పుస్తకం తీసుకురావడం అభినందనీయమన్నారు. విశ్రాంత డీజీపీ ఎస్‌ఏ హుడా, వాటర్ రీసోర్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వి. ప్రకాశ్‌రావు మాట్లాడారు. చరిత్రలోని మంచిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో చరిత్రకారులు డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ, పి అనూరాధారెడ్డి, డాక్టర్ ఎల్ శివనాగురెడ్డి, ప్రొఫెసర్ లావణ్య, సమన్వయ కర్త షాలిని కాకాని, డాక్టర్ సురేశ్ దేవరాయ, కృష్ణ దేవరాయ తదితరులు పాల్గొన్నారు. పూర్వీకుల చరిత్రను తొలి పుస్తకంగా తీసుకురావడం గర్వంగా ఉందని రచయిత అన్నారు.

## డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయండి : కార్పొరేటర్



కాచిగూడ, జూన్ 18: ప్రజల సహకారంతో కాచిగూడ డివిజన్‌ను మరింత అభివృద్ధి చేయనున్నట్లు కార్పొరేటర్ ఉమా రమేశ్ యాదవ్ తెలిపారు. డివిజన్‌లోని బర్కత్‌పుర, టూరిస్ట్ జంక్షన్‌లో బుధవారం కార్పొరేటర్ పర్యటించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జలమండలి ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్‌యాదవ్, అర్జున్, వినోద్, విజయ్, భీమ్‌రాజ్, సూరి, రవి యాదవ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కరాటే బెల్టులు, సర్టిఫికెట్లు అందజేసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

# విద్యార్థులు కరాటే నేర్చుకోవాలి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, జూన్ 18 : ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు కరాటేను తప్పనిసరిగా నేర్చుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గోల్డెన్ డ్రాగన్ కరాటే అకాడమీ వ్యవస్థాపకుడు విక్కీ మాస్టర్ నేతృత్వంలో తిలక్‌నగర్‌లోని సెయింట్ హన్నాస్ హైస్కూల్‌లో 200 మంది విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు, వేసవి శిబిరం నిర్వహించారు. ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన కరాటే టోర్నమెంట్‌లో విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత విజేతలను సన్మానించి, సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమన్నారు. గోల్డెన్ డ్రాగన్ కరాటే అకాడమీ విద్యార్థుల ప్రతిభను మెచ్చుకున్నారు. కార్యక్రమంలో సెయింట్ హన్నాస్ హైస్కూల్ కరస్పాండెంట్ సల్మాన్‌రాజ్, డైరెక్టర్ జాషువా ప్రేమ్‌రాజ్, కోచ్ శ్యామ్‌సుందర్, మేఘ తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడిగా డాక్టర్ వెంకటరమణ



అబిడ్స్, జూన్ 18: న్యూఢిల్లీలోని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా డాక్టర్ ఎం వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రిజిస్ట్రార్, సెక్రటరీ అనిల్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ వెంకటరమణ ఐదు సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం ఫార్మసీ టీచర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న డాక్టర్ ఎం వెంకటరమణ రెండోసారి ఫార్మసీ కౌన్సిల్‌కు సభ్యుడిగా నామినేట్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఫార్మసీ విద్యాభ్యాసాన్ని పర్యవేక్షించడంతో పాటు ఫార్మసీ కళాశాలల అనుమతుల నియంత్రణకు కృషి చేస్తానన్నారు.

## విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలి



కాచిగూడ, జూన్ 18: పెండింగ్‌లో ఉన్న 20 లక్షల మంది విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నింబోలి అడ్డ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యాపై అవగాహన లేని సీఎం విద్యాశాఖను తన దగ్గర పెట్టుకోవడం వల్ల విద్యా వ్యవస్థ మరింత భ్రష్టుపట్టిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, మెడిసిన్, పీజీ, డిగ్రీ, తదితర కోర్సులు చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ, విద్యార్థులకు రూ.4,200 కోట్ల రూపాయలు ఫీజు బకాయిలు ఉన్నాయన్నారు. ఈ విషయమై అనేకమార్లు విద్యార్థులు ఆందోళనలు చేపట్టి, ర్యాలీలు తీసినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని మండిపడ్డారు. ఇటీవల జరిగిన అందాల పోటీలకు ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు పెట్టిందని, అదే ఖర్చు ఫీజు బకాయిలు చెల్లిస్తే విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపినట్లయ్యేదని పేర్కొన్నారు. ఆయన వెంట పి.కృష్ణ, భూషణ్ భాస్కర్, డాక్టర్ ప్రశాంత్ నిమ్కర్, ముత్యాలరావు, ప్రదీప్‌గౌడ్, సత్యప్రకాశ్‌సింగ్ ఉన్నారు.

### ఉస్మానియా దవాఖానలో వసతుల కల్పనలో


# ప్రభుత్వం, ఎమ్మెల్యే రాజాసింగ్ విఫలం : బీఆర్‌ఎస్



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ గోషామహల్ నియోజకవర్గ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్, జూన్ 18: ఉస్మానియా దవాఖానలో రోగులకు వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొనడం విడ్డూరంగా ఉందని నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు ఎం ఆనంద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. దవాఖానలో వసతుల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా పూర్తిగా విఫలమయ్యా రని ఆరోపించారు. గౌలిగూడలోని తన నివాసంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉస్మానియా ఆసుపత్రి గోషామహల్ నియోజకవర్గంలో ఉందన్న విషయాన్ని ఎమ్మెల్యే రాజాసింగ్ విస్మరించారని ఎద్దేవా చేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, నిధులు మంజూరు చేయించి రోగులకు మెరుగైన వైద్య సేవలు, సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉందన్నారు. రోజూ ఎమ్మెల్యే రాకపోకలు సాగించే పురానాపూల్ గాంధీ విగ్రహం నుంచి బేగం బజార్ భూలక్ష్మమ్మ టెంపుల్ వరకు ధ్వంసమైన సీవరేజీ లైన్ స్థానంలో నూతన పైప్‌లైన్ మంజూరు చేయించడంపై దృష్టి సారించాలని సూచించారు. జ్ఞాన్‌బాగ్ కాలనీలో కమ్యూనిటీ హాల్ అవసరం లేదని, పార్కు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఘనంగా బల్కంపేట ఎల్లమ్మ తల్లి బోనాలు



సుల్తాన్‌బజార్, జూన్ 18: టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బల్కంపేట ఎల్లమ్మతల్లికి బోనాలను ఘనంగా సమర్పించారు. బుధవారం టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ ఆధ్వర్యంలో బల్కంపేట ఎల్లమ్మతల్లికి ఐదవ వార్షికోత్సవ బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కేంద్ర సంఘ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, గెజిటెడ్ అధికారుల సంఘ అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు, టీఎన్జీవో, వివిధ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు, ప్రాథమిక మెంబర్స్, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. డబ్బు వాయిద్యాలు.. శివసత్తుల నృత్యాల మధ్య అమ్మవారికి బోనాలను సమర్పించి దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్, టీఎన్జీవో హైదరాబాద్ జిల్లాశాఖ అధ్యక్షుడు విక్రమ్‌కుమార్, కార్యదర్శి కే. శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, కోశాధికారి బాల్‌రాజు, కొండల్ రెడ్డి, పర్వతాలు, శైలజ, నరేశ్, సుజాత, వైదిక శస్త్ర, ఏవీ శ్రీధర్, ముఖీమ్, ఖురేషి, శంకర్, రాజ్‌కుమార్, నరేందర్, రాజ్‌కుమార్, అయోధ్య, వరప్రసాద్, మహేందర్, ఐటీఐ సత్యనారాయణ, యోగేశ్, ఎమ్మే రవి, సుదర్శన్, అరుణ, శివ, అశోకరాణితోపాటు యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మల్లేపల్లిలో స్థల వివాదం.. ఉద్రిక్తత

- జీహెచ్‌ఎంసీ స్థలం తనదేనంటూ వచ్చిన వ్యక్తి
- వెనక్కు పంపిన అధికారులు, నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్



మెహిదీపట్నం, జూన్ 18: నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్ బడి మసీదు పక్కనే ఉన్న ఇబ్రహీం మసీదుకి చెందిన స్థలం తనదంటూ ఓ వ్యక్తి బుధవారం కోర్టు ఉత్తర్వులతో స్థలం స్వాధీనానికి రావడంతో ఉద్రిక్తత నెలకొన్నది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఈ స్థలం ముమ్మాటికీ జీహెచ్‌ఎంసీదేనని అధికారులు పేర్కొన్నారు. దక్షిణ పరిశ్రమ మండలం అదనపు డీసీపీ ఎగ్బాల్ సిద్ధిఖీ చేరుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పి పంపించి వేశారు. కాగా స్థలానికి సంబంధించిన పత్రాలను కోర్టులో సమర్పించి స్థలాన్ని కాపాడాలని ఎమ్మెల్యే జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు.

# నీటి సమస్యలు తలెత్తకుండా చూడండి..



మెహిదీపట్నంలో ప్రజలతో మాట్లాడుతున్న నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్

మెహిదీపట్నం, జూన్ 18: ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా కృషి చేయాలని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ జలమండలి అధికారులకు సూచించారు. బుధవారం మెహిదీపట్నం ఖాజా గుల్షన్ ప్రాంతంలో ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు నీటి సమస్యలపై ఫిర్యాదు చేయడంతో, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి డాక్టర్ షేక్ ఖాసీం, జలమండలి సీజీఎం వినోద్ భార్గవ్, జీఎం శ్రీనూనాయక్, డీజీఎం మురళి, మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యంతో చదవాలి



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న కాచిగూడ కళాశాల ప్రిన్సిపాల్ చిరంజీవి, సిబ్బంది

కాచిగూడ, జూన్ 18: ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.చిరంజీవి అన్నారు. బుధవారం కళాశాల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను ప్రిన్సిపాల్ చిరంజీవి అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగినప్పుడే విజయాలు సాధిస్తారని, ఆ దిశగా విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఇంటర్ విద్య విద్యార్థుల భవిష్యత్‌కు పునాది వంటిదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసరావు, గీతాబాయ్, వి.ప్రసాద్‌రావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.లక్ష్మయ్య గంగపుత్ర, రామ్మోహన్, అనిల్‌రెడ్డి, నర్సిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా ఇన్ వేదిక్ ఆస్ట్రాలజీ పరీక్ష వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో వచ్చే నెల 16న నిర్వహించనున్న అడ్వాన్స్ పీజీ డిప్లొమా ఇన్ వేదిక్ ఆస్ట్రాలజీ మొదటి సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను తిరిగి వచ్చే నెల 18వ తేదీన నిర్వహించనున్నామన్నారు. పరీక్షా కేంద్రం, సమయంలలో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఇతల వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

# విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వై.అమృత, గౌతమ్‌రావు

అంబర్‌పేట, జూన్ 18 : నల్లకుంట డివిజన్ నర్సింహబస్తీలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గ ఎస్సీ మోర్చా కన్వీనర్ మంగి శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత, సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎన్.గౌతమ్‌రావు పాల్గొని విద్యార్థులకు బ్యాగులను అందజేశారు.

కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎస్.నర్సింగ్‌రావు, నాయకులు ఎం.శ్యాంరాజు, అజయ్‌కుమార్, శ్రీకాంత్, డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్ జోషి, ఎన్.మహేశ్, మల్లికార్జున్, లక్ష్మణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

## దేవాదాయశాఖ కమిషనర్ పదవీ కాలం పొడిగించాలి



అబిడ్స్, జూన్ 18: దేవాదాయశాఖ కమిషనర్ ఎస్. వెంకట్రావు పదవీ కాలం పొడిగించాలని అర్చకుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, కన్వీనర్ పరాశరం రవీంద్రచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ అగ్నిహోత్ర చంద్రశేఖర్ శర్మ, రత్నాకర్‌రావు, హైమావతి, కాండూరి కృష్ణమాచారి, అర్చకుల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం కాండూరి కృష్ణమాచారి చిత్రీకరించిన కమిషనర్ చిత్రపటాన్ని జేఏసీ తరపున ఆయనకు అందజేశారు.

## అనారోగ్యంతో టౌన్ ప్లానింగ్ ఏసీపీ మృతి



సుమన(ఫైల్)

మెహిదీపట్నం జూన్ 18 : జీహెచ్‌ఎంసీ సర్కిల్-13 (కార్వాన్) టౌన్ ప్లానింగ్ ఏసీపీ మంత్రి సుమన(51) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్-13లో టౌన్ ప్లానింగ్ ఏసీపీగా సుమన నాలుగు నెలల క్రితం నియమితులయ్యారు. కాగా ఆమె గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. సోమవారం క్యాన్సర్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వచ్చారు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఆకస్మికంగా మృతి చెందారు. టౌన్ ప్లానింగ్ ఏసీపీ సుమన మృతికి కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్, డిప్యూటీ కమిషనర్ శశిరేఖ సంతాపం తెలిపారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్-13 కార్యాలయంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## బీ ఫార్మసీ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీ ఫార్మసీ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీ ఫార్మసీ (పీసీఐ) ఎనిమిదో సెమిస్టర్ మెయిన్, ఏడు, ఎనిమిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# మూన్నాళ్లకే కుప్పకూలిన వర్టికల్ గార్డెన్!

- ఫీవర్ ఆసుపత్రి రత్నానగర్ బ్రిడ్జి వద్ద ఘటన
- గాలి వీయడం వల్లే కూలిందంటున్న అధికారులు



ఫీవర్ ఆసుపత్రి రత్నానగర్ బ్రిడ్జి వద్ద కూలిపోయిన వర్టికల్ గార్డెన్

అంబర్‌పేట, జూన్ 18 : నల్లకుంట డివిజన్ హాస్పిటల్ రత్నానగర్ హుస్సేన్‌సాగర్ సర్‌ప్లస్ నాలా బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన వర్టికల్ గార్డెన్ బుధవారం గాలికి కుప్పకూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రోడ్డుపై నిలిచి ఉన్న వాహనంపై వర్టికల్ గార్డెన్ కోసం ఉపయోగించిన ఇనుప కడ్డీలు పడిపోయాయి. గాలి వీచడమే కాకుండా నిత్యం ఈ గార్డెన్‌కు జీహెచ్‌ఎంసి సిబ్బంది బోర్ వాటర్‌ను ఉపయోగిస్తున్నారు. బోర్ వాటర్‌తో ఇనుము తుప్పు పట్టడం, అదే సమయంలో గాలి బాగా వీయడంతో గార్డెన్ మొత్తం కింద పడిపోయిందని అధికారులు భావిస్తున్నారు. కాగా 2022 జూన్‌లో జీహెచ్‌ఎంసీ రూ. 49లక్షలు వెచ్చించి బ్రిడ్జికి రెండు వైపులా ఈ గార్డెన్‌ను ఏర్పాటు చేసింది. ఈ బ్రిడ్జిపై ప్రజలు బహిరంగ మూత్ర విసర్జన చేయడంతో దుర్వాసన వెదజల్లుతున్నది. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దృష్టికి తీసుకురాగా జీహెచ్‌ఎంసీ నిధులు మంజూరు చేయించగా ఫ్లోరా సంస్థ ఈ వర్టికల్ గార్డెన్‌ను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం కూలిపోయిన వైపు 30 మీటర్ల వరకు ఈ గార్డెన్‌ను రూపొందించారు. అయితే దీన్ని ఏర్పాటు చేసే సమయంలో ఇలాంటి సపోర్టు లేకుండా చేయడం వల్లనే ఇది కూలిపోయిందని పలువురు పేర్కొంటున్నారు. కేవలం మూడు సంవత్సరాల వ్యవధిలోనే ఇలా ఎందుకు జరిగిందని, పనుల్లో నాణ్యత లేకపోవడం వల్లనే ఈ వర్టికల్ గార్డెన్ కూలిపోయిందని ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ అనిల్ కుమార్, సర్కిల్ మేనేజర్ మహేశ్వరి, అర్టికల్చర్ అసిస్టెంట్ బ్లెస్సీ, యూబీడీ, టీఏలు ఫయాజ్, శ్రీధర్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకొని సిబ్బందితో పాటు డీఆర్ఎఫ్ సిబ్బందితో కూలిన గార్డెన్ కు ఉపయోగించిన పరికరాలు తొలగింపజేశారు.

# డ్రగ్స్, గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు అరెస్ట్

మెహిదీపట్నం, జూన్ 18: నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న ఆరుగురిని పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు మాసబ్ ట్యాంక్ పోలీసులతో కలిసి అరెస్ట్ చేశారు. వారి వద్ద రూ.2.25లక్షల విలువైన హ్యాష్ ఆయిల్‌తో పాటు మొత్తం రూ.6.50లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మాసబ్ ట్యాంకుకు చెందిన మహమ్మద్ ఫైజాన్ (22), శ్రీకాకుళంకు చెందిన, జీడిమెట్ల చింతల్‌లో నివసిస్తున్న ఎలాగడ నవ్య(25) గంజాయి, చేరస్, హ్యాష్ ఆయిల్ విక్రయిస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. జగద్గిరిగుట్ట శ్రీనివాస్‌నగర్‌లో నివసించే కే. వీరచారి(22), గాజులరామారానికి చెందిన సామ్ అజయ్‌కుమార్ (20), ఐడీపీఎల్‌లో నివసించే వేముల హర్షిత్(20), మహమ్మద్ సమీర్ (20 ) ఫైజాన్, నవ్యల వద్ద డ్రగ్స్, గంజాయి కొని అమ్ముతూ డబ్బులు సంపాదిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం ఉదయం మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో ఫైజాన్‌ను పట్టుకొని విచారించారు. ఈ సమాచారంతో నవ్యతోపాటు వారి వద్ద గంజాయి, హాష్ ఆయిల్ తీసుకొని విక్రయిస్తున్న నలుగురిని పట్టుకున్నారు. అంతేకాకుండా వీరి వద్ద గంజాయి కొని సేవిస్తున్న గాజులరామారంలో నివసించే సామ్ విజయ్ కుమార్(20), మాసబ్ ట్యాంక్ లో నివసించే సయ్యద్ మూర్తుజా అలీ హుస్సేన్(35)ను పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రెండు లక్షల 25 వేల విలువ చేసే 375 ఎంఎల్ హ్యాష్ ఆయిల్, 175 గ్రాముల ఎండు గంజాయి, 3 గ్రాముల చరస్, 2 కత్తులు, 15 చిల్లంలు, 3 ద్విచక్ర వాహనాలు, 8 సెల్‌ఫోన్లు, బోంచే త్రిస్ ఓసీబీ పేపర్, రూ. 6.50 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉన్నది. ఈ సందర్భంగా టాస్కోర్స్ డీసీపీ సురేంద్ర మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను డ్రగ్స్ లేని నగరంగా మార్చడానికి ప్రజలు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ యాదేంద్ర, మాసబ్‌ట్యాంక్ ఇన్‌సెక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## మంత్రి వివేక్‌కు శుభాకాంక్షలు



అబిడ్స్, జూన్ 18: రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గడ్డం వివేక్ వెంకట్‌స్వామికి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కురుమ యువత రాష్ట్ర అధ్యక్షుడు తూముకుంట అరుణ్‌కుమార్, చేతన్, బొమ్మరాజాకృష్ణమూర్తి, నవీన్ ముదిరాజ్, ధనరాజ్ యాదవ్ తదితరులు సచివాలయంలోని కార్యాలయంలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## లైంగిక దాడి కేసులో నిందితుడికి మూడేండ్ల జైలు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జూన్ 18(నమస్తే తెలంగాణ) : సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడికేసులో నిందితుడు సూర్యవంశీ పవన్ కుమార్ అలియాస్ పవన్ అలియాస్ చిన్న బబ్లూ(22)కు మూడేండ్ల జైలు శిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ నాంపల్లిలోని ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి టి.అనిత బుధవారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ.రాంరెడ్డి కథనం ప్రకారం.. సింగరేణి కాలనీలో నివసిస్తున్న మైనర్ బాలిక ఇంట్లోకి నిందితుడు బబ్లూ చొరబడి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాలికతో పాటు సోదరుడు సింగరేణి కాలనీలో గుడిసెలో నివసిస్తున్నారు. తల్లి ఆరోగ్యం బాగోలేదని తెలిసి సోదరుడు సొంత గ్రామానికి వెళ్లాడు. ఆ సమయంలో సదరు మైనర్ బాలిక ఒంటరిగా గుడిసెలో ఉండటాన్ని పసిగట్టిన నిందితుడు ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలిక వాంగ్మూలాన్ని నమోదు చేసి, సాక్ష్యాధారాలను సేకరించి 2019లో సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ బి.చంద్రమోహన్ కోర్టుకు చార్జిషీట్ సమర్పించారు.

సుధీర్ఘ విచారణ చేపట్టిన కోర్టు సాక్షుల వాంగ్మూలాన్ని పరిశీలించిన అనంతరం నిందితుడు నేరం చేసినట్టు రుజువుకావడంతో శిక్షను ఖరారు చేశారు. కేసు విచారణకు సహకరించిన అధికారి కల్పన, కానిస్టేబుల్స్ గంగరాజు, మహేశ్‌ను అధికారులు అభినందించారు.


## రేపు డయల్ యువర్ ఆర్‌ఎం

కాచిగూడ, జూన్ 18: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే తమ లక్ష్యమని హైదరాబాద్ రీజియన్ రీజినల్ మేనేజర్ సుధా పరిమళ అన్నారు. బుధవారం కాచిగూడ టెర్మినల్ ఆర్టీసీ డిపోలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 20న ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలను పేర్కొంటూ, సలహాలు, సూచనల కోసం 8885719194 ఫోన్ చేసి తెలపాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## నూతన భవనంలో పూజలు, బాధ్యతల స్వీకరణ

అంబర్‌పేట, జూన్ 18 : కాచిగూడ పోలీస్ క్వార్టర్స్‌లో ఉన్న కాచిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం అంబర్‌పేటకు మార్చారు. గతంలో అంబర్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కోసం నూతనంగా నిర్మించిన భవనంలోకి దీన్ని మార్చారు. అంబర్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ను రీఆర్గనైజేషన్‌లో భాగంగా రద్దు చేశారు. కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ పూజలు నిర్వహించి బాధ్యతలు స్వీకరించారు.

## 29న కనకదుర్గమ్మకు బంగారు బోనం



చార్మినార్, జూన్ 18 : నగరంలో అత్యంత వైభవంగా నిర్వహించే ఆషాఢ బోనాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో సప్త మాతృకలకు సప్త బంగారు బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ ఏడాది విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయంలోనూ బంగారు బోనం సమర్పించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ తెలిపారు. బుధవారం ఆయన కమిటీ సభ్యులతో కలిసి విజయవాడ కనకదుర్గ అమ్మవారి దేవస్థాన సీఈఓ సీనానాయక్‌ను కలిశారు. ఈనెల 29న బంగారు బోనం సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మధుసూదన్‌గౌడ్, ఎం.మధుసూదన్ యాదవ్, రాందేవ్ అగర్వాల్, దత్తాత్రే య, దినేశ్, చేతన్‌సూరి, శ్రీనివాస్, బుచ్చన్న, సాత్విక్ తదితరులున్నారు.